

సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

పార్వతీపురం రూరల్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): సివిల్స్‌లో ప్రిలిమ్స్, మెయిన్ పరీక్షలకు సంబంధించి నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారిత అధికారి ఇఅప్పన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కుల, విద్య, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాన్‌కార్డు, రెండు ఫొటోలను దరఖాస్తులకు జత చేసి జిల్లాకేంద్రంలోని కార్యాలయానికి అందించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఈ 85001 87124, 97017 86751, 91608 01497 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ప్రయాణం.. కాకూడదు బతుకు ఛిద్రం

- మానవ తప్పిదంతో నేటికీ ఎన్నో ప్రమాదాలు
- అగమ్యగోచరంగా ఆయా కుటుంబాలు
- ఇంటి పెద్ద మరణిస్తే.. వీధిన పడాల్సిందే..
- హెల్మెట్ ధారణ, స్వీయరక్షణ తోనే ప్రమాదాలకు దూరం
- నేడు రోడ్డు ప్రమాద మృతుల స్మృతి దినం



రోడ్డు ప్రమాదంలో ఒకరిని కోల్పోతే ఓ కుటుంబమే రోడ్డున పడుతుంది. ఒక్కసారిగా నడి సముద్రంలో నెట్టేసినట్లు అనిపిస్తుంది. భవిష్యత్ కనిపించని ఆందోళన చుట్టుముడు తుంది. నలుగురైదుగురు కుటుంబ సభ్యులకు శిక్ష పడిన అనుభవం తోస్తుంది. అందుకే రోడ్డుపై ప్రయాణించేటప్పుడు కుటుంబాన్ని గుర్తు పెట్టుకుని ముందుకు వెళ్లాలని, రూల్స్ పాటిస్తూ జాగ్రత్తగా ప్రయాణం సాగించాలని మానసిక వైద్య నిపుణులు చెబుతుంటారు. స్వీయరక్షణే కీలకమంటారు. ఇటు ప్రభుత్వం కూడా ప్రమాదకర స్థలాల వద్ద జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యం. ఈ ప్రక్రియ సరిగా జరగక అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నేడు రోడ్డు ప్రమాద మృతుల స్మృతి దినం సందర్భంగా ప్రత్యేక కథనం

కుటుంబ పోషణ కష్టం..



చిన్నారితో లలిత

భామిని, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): డోకులగూడకు చెందిన కొండగొర్రె నగేష్ పోడు వ్యవసాయం చేసుకుని భార్య, పిల్లలతో హాయిగా జీవనం సాగించేవాడు. అయితే జూలై 9న బ్యాంకు పని నిమిత్తం బైక్‌పై మరొకరితో కలిసి భామిని వచ్చాడు. పని ముగించుకుని తిరుగు ప్రయాణమవుతున్న సమయంలో బైక్ అదుపు తప్పింది. వాహనం వెనుక ఉన్న నగేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. మృతుడి భార్య లలిత దివ్యాంగురాలు.. కూలి పనులు చేయలేని పరిస్థితి. మగ దిక్కు లేవడంతో నలుగురు పిల్లలతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని ఆమె వాపోయింది. నలుగురు పిల్లల్లో ఒకరు భామిని ఏకలవ్య పాఠశాలలో, నల్లరాయిగూడ, సన్నాయిగూడ పాఠశాలలో మరో ఇద్దరు చదువుతున్నారు. దివ్యాంగ పింఛన్ వస్తున్నా.. అది ఏ మాత్రం చాలడం లేదని, చిన్న పిల్లను ఇంటిలో వదిలి బయట పనులకు వెళ్లలేకపోతున్నామని ఆమె పేర్కొంది. తమ కష్టాలను అధికారులు గుర్తించి ఆదుకోవాలని కోరింది.

అంతా అంధకారం..



కుమార్తెలకు అండగా నిలిచిన తల్లి మంగమ్మ

గరుగుబిల్లి, నవంబరు 15(ఆంధ్ర జ్యోతి): గిజబ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ మరడాన ఆదినారాయణ ఖడ్గవలస సముదాయంలో పెట్రోల్ బంకు నిర్వహిస్తుండేవారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఏడాది సెప్టెంబరు 15న రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి పయనమయ్యారు. అయితే నందివాని వలస రహదారి మలుపులో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో ఆ కుటుంబంలో అంధకారం అలుముకుంది. కుటుంబ పెద్ద మృతిని భార్య మంగమ్మ జీర్ణించుకోలేకపోతున్నారు. అయితే కూతుళ్ల కోసం తేరుకుని.. ప్రస్తుతం మంగమ్మ అటు పెట్రోల్‌బంకు.. ఇటు కుటుంబ వ్యవహారాలు చూసుకుంటున్నారు. తన భర్త హెల్మెట్ పెట్టుకున్నట్లయితే ప్రమాదం నుంచి బయటపడేవారని తెలుపుతూ ఆమె కన్నీటిపర్యంతమయ్యారు.

బాధలు దిగమింగుకుని..



సుజాత

మక్కువ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎర్ర సామంతవలసకు చెందిన మండంగి సుబ్బారావు ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. భార్య సుజాత, ఇద్దరు పిల్లలతో కలిసి సంతోషంగా ఉండేవాడు. అయితే ఈ ఏడాది జూన్ 3న అడారు సమీపంలో ట్రాక్టరు బోల్తా పడి మృతి చెందాడు. దీంతో భార్యాబిడ్డలు అనాథలైపోయారు. కుమారుడు, కుమార్తెను ఎలా పెంచాలి? ఎలా చదివించాలో సుజాతకు అర్థం కాలేదు. ఆ తర్వాత బాధలన్నీ దిగమింగుకుని కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. తమకు ఎటువంటి ఆస్తులు లేవని, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని ఆమె తెలిపింది. 'తల్లికి వందనం' నగదు ఎంతగానో ఉపయోగపడిందని చెప్పింది. ప్రభుత్వం ఆదుకుంటే పిల్లలను మరింత బాగా చదివించుకుంటానని పేర్కొంది.

నిబంధనలు పాటించాలి..

లైసెన్స్ లేని వారికి, చిన్నారులకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదు. తల్లిదండ్రులు మైనర్లపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఒక బైక్‌పై ఇద్దరికి మించి ప్రయాణించకూడదు. మద్యం తాగి బండి నడపరాదు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయరాదు. 40శాతం ప్రమాదాలకు కారణం నిర్లక్ష్యమే. 40శాతం రహదారి నిబంధనలు పాటిస్తే కుటుంబాలు సంతోషంగా ఉంటాయి. రోడ్డుప్రమాదంలో ఎవరైనా మృతి చెందితే కుటుంబం పడే బాధ వర్ణనాతీతం. ఈ విషయాన్ని వాహనదారులు గుర్తుపెట్టుకోవాలి. ప్రయాణంలో ఉన్నా కుటుంబం గురించి ఆలోచించాలి. నిదానమే ప్రధానం. ఇదే లక్ష్యంతో పోలీసులు నిరంతరం తనిఖీలు చేస్తుంటారు.

-ఫకృద్దీన్, ఎస్ఐ, గురుగుబిల్లి

సాలూరు, భామినిలో పత్తి కొనుగోలు

పార్వతీపురం రూరల్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నుంచి సాలూరు , భామినిలో పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి ఆర్ఆర్.యేసురాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పత్తి కనీస మద్దతు ధర క్వింటాకు రూ.8,110గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పొట్టి పింజను క్వింటా రూ.77,10 చొప్పున కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా కొనుగోలు చేస్తామని వెల్లడించారు. రైతులు తమ మొబైల్ ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని శ్లాట్ బుకింగ్ చేసుకోవచ్చన్నారు.

అంతిమ సంస్కారాలకు అగచాట్లు

- రహదారి లేక మృతదేహాల తరలింపునకు పాట్లు

8లో

రేపటి నుంచే..

- జిల్లాలో ధాన్యం కొనుగోలు
- కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి



సుంకి సమీపంలో ధాన్యం నిల్వలు ఆరబెట్టిన రైతులు



గొట్టివలసలో సిద్ధమైన ధాన్యం కొనుగోలు కేంద్రం

గరుగుబిల్లి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. 15 మండలాల పరిధిలోని 281 రైతుసేవా కేంద్రాల్లో 180 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటికి అవసరమైన సిబ్బందిని నియమించారు. గోనె సంచులు, హమాలీలు, రవాణాకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. వాస్తవంగా ఈ ఏడాదిలో ఖరీఫ్ రైతులు 1.86 లక్షల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ఈ నేపథ్యంలో సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల వరకు దిగుబడులు వస్తాయని అధికారుల అంచనా. గతేడాది 2.5 లక్షల మెట్రిక్ టన్నుల మేర కొనుగోలు చేశారు. ఈ ఏడాది అదనంగా కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ నెల 17 నుంచి ధాన్యం కొను గోలుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు ఇచ్చిన తరువాతే రైతుల ఖాతాల్లోకి నగదు జమయ్యే అవకాశం ఉంది. అయితే జిల్లాలో మిల్లర్లదే ఆలస్యం. వారు బీజీ ఇచ్చిన వెంటనే ప్రక్రియ వేగవంతం కానుంది.

రైతులు సన్నద్ధం

రైతులు ధాన్యం నిల్వలను సిద్ధం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పలు గ్రామాల్లో యంత్రాల సాయంతో నూర్పులు చేసి శుభ్రపర్చే దిశగా చర్యలు చేపడుతున్నారు. మరికొన్నిచోట్ల నిల్వలను ఆరబెట్టి బస్తాలలోకి నింపుతున్నారు. తేమ శాతంతో పాటు నాణ్యతతో కూడిన ధాన్యాన్ని కేంద్రాలకు అందించేందుకు

(మిగతా 8వ పేజీలో...)

వచ్చేనెల 13న లోక్ అదాలత్

బెలగాం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వచ్చేనెల 13న లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రెండో అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.దామోదరరావు తెలిపారు. శనివారం జిల్లా కోర్టు సమావేశ మందిరంలో పోలీస్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌కు తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. రాజీ మార్గం ఉత్తమమైనదని, దీనివల్ల ఇరు పక్షాల కక్షిదారులకు డబ్బు, సమయం ఆదా అవుతుందని చెప్పారు. మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందన్నారు. కోర్టుకు ఎటువంటి ఫీజు చెల్లించకుండా కేసులు రాజీ చేసుకోవచ్చని వెల్లడించారు. లోక్ అదాలత్‌లో బాధితులకు సత్వర న్యాయం అందుతుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సీఐలు, ఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా టు కేరళ

- గంజాయితో బత్తిలి మీదుగా ప్రయాణం
- చెక్‌పోస్టును దాటి దూసుకెళ్లిన కారు
- సినీ ఫక్కీలో చిక్కిన నిందితులు
- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాంబాబు



పట్టుకున్న గంజాయి, నిందితులతో డీఎస్పీ తదితరులు

భామిని, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బత్తిలి చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ఆపకుండా దూసుకెళ్లిన కారును పోలీసులు వెంబడించి పట్టుకున్న సంగతి తెలిసిందే. సినీ ఫక్కీలో ఇద్దరు నిందితులను పట్టుకుని గంజాయి ప్యాకెట్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా.. శనివారం బత్తిలి పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు వివరాలను పాలకొండ డీఎస్పీ రాంబాబు వెల్లడించారు. కేరళకు చెందిన ప్రతాప్‌సింగ్, నదిమ్ సునీల్ కొద్దిరోజుల

(మిగతా 8వ పేజీలో...)

పరిసరాలతో పాటు వ్యక్తిగత

పరిశుభ్రత ముఖ్యం

- ప్రభుత్వ విప్ జగదీశ్వరి

కురుపాం, నవంబరు15(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. శనివారం కురుపాం ఏపీ ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్యానికి పెద్దపీట వేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని, చేతులు ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ .. విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించేందుకు పాఠశాల, కళాశాలల్లో ముస్తాబు అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పిల్లలు శుభ్రంగా ఉంటే వ్యాధులు దరి చేరవని తెలిపారు. అనంతరం విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీపీవో కొండలరావు, సర్వ శిక్ష అభియాన్ ఏపీసీ తేజేశ్వరరావు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి, కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

సోలార్ ఏర్పాటుకు చర్యలు

- ట్రాన్స్‌కో ఎస్ఈ మల్లికార్జునరావు



పాచిపెంట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్ఈ

పాచిపెంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్య ఘర్ పథకం కింద జిల్లాలో గృహాలకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతు న్నామని విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.మల్లికార్జున రావు తెలిపారు. శనివారం పాచిపెంట విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోలార్ ఏర్పాటుకు ఇంటి పైకప్పుపై వంద చదరపు అడుగుల విశాలమైన స్థలం ఉండాలి. ముఖ్యంగా

(మిగతా 8వ పేజీలో...)

సువర్ణముఖిలోకి 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

8లో

నిధులు మంజూరు చేయండి

- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌ను కలిసిన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు
- విశాఖ సీఐఐ సదస్సుకు హాజరు

7లో



క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు

నమో వేంకటేశ

- తోటపల్లికి పోటెత్తిన భక్తులు
- క్యూలైన్లు కిటకిట
- ఏడు వేలకు పైగా తరలివచ్చిన జనం

గరుగుబిల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసద్ధిగాంచిన తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీకమాసంలో ఆఖరి శనివారం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి సుమారు 7 వేలకు పైగా జనం తరలివచ్చారు. క్యూలైన్లలో గంటల కొద్దీ నిరీక్షించిన అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా దేవస్థానాల పరిధిలో ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈవో బి.శ్రీనివాస్ ప్రత్యేక క్యూలైన్లతో పాటు టెంట్లను ఏర్పాటు చేశారు. దర్శనం సమయంలో తోపులాట జరగకుండా ఎస్ఐ ఫకృద్దీన్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. స్వామివారి దర్శనానికి వచ్చిన వారికి దేవస్థానం అభివృద్ధి ట్రస్ట్ ఉచిత ప్రసాదాలు, అన్నసమారాధన, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించారు. 200 మంది శ్రీవారి సేవకులను కూడా భక్తులకు అందుబాటులో ఉంచారు. మొత్తంగా దేవస్థానం ప్రాంగణాలు నమో వెంకటేశాయ, గోవింద నామస్మరణతో మార్మోగాయి.



పూజలందుకున్న స్వామివారు

సీనియర్ సిటిజన్లకు న్యాయ సేవలు

- ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయాధికారి బబిత

7లో

బిర్సాముండాను ఆదర్శంగా తీసుకోవాలి

8లో

- కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి
- జిల్లాలో జన జాతీయ గౌరవ దివస్

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

గజపతినగరం,నవంబరు15(ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో ఆదివారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించ నున్నట్లు సీఈవో నారాయణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ రామసుందర్‌రెడ్డితోపాటుజిల్లా అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

గంట్యాడ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలుపై టీఏ, డీఏ, మిల్లర్లకు అధికారులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఈ శిక్షణ జరిగింది. మండలంలో 20రైతు సేవా కేంద్రాల్లో 16 క్లస్టర్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డి సూచించారు. కార్యక్రమంలో సీఎస్ డీటీ నారాయణమూర్తి, వ్యవసాయ అధికారి శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

25న రెడ్‌క్రాస్ సమావేశం

చీపురుపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లిలో రెడ్‌క్రాస్ సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్‌ను ఏర్పాటు చేసేందుకు ఈ నెల 25న సమావేశం నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ డి. ధర్మరాజు, మేనేజింగ్ కమిటీ మెంబరు బీవీ గోవిందరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు చీపురుపల్లి తహసీల్దారు కార్యాలయంలో సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి పేట్రన్స్ వైస్ పేట్రన్స్ హాజరు కావాలని వారు కోరారు.

అక్షరాస్యతపై అవగాహన

విజయనగరం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అక్షరాస్యతపై అవగాహన పెంపొందించాలని ఎంపీడీవో గంటా వెంకటరావు అన్నారు. శనివారం తన కార్యాలయంలో అక్షరాస్యత, నిరక్షరాస్యత కార్యక్రమంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు, వయోజన విద్య మండల అధికారులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేతో బహుళ ప్రయోజనాలు

రేగిడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేతో బహుళ ప్రయోజనాలు కలగనున్నాయని ఎంపీడీవో శ్యామలాకుమారి తెలిపారు. గుల్లపాడు పంచాయితీ కేఎం వలసలో గ్రామసభ నిర్వహించారు. గ్రామకంఠ స్థలాలపై యజమానులకు పూర్తి హక్కులు కల్పిస్తున్నామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎంపీడీవో కోరారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో జగన్నాథరావు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

శృంగవరపుకోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు, ఎరువులు సకాలంలో తెప్పించి రైతులను ఆదుకోవాలని పుణ్యగిరి వెలమ సంక్షేమ సంఘం నాయకులు ఎస్.కోట పీఏసీఎస్ ఛైర్మన్ గొర్రిపాటి సింహాచలం నాయుడును కోరారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కొల్లి కోటేశ్వరరావు, మెరుపుల నారాయణ మూర్తి, అప్పారావు, చప్ప శ్రీనివాసరావు, రాయవరపు శ్రీనివాసరావు, చోడవరపు వెంకటరావు, కోటరావు తదితరులు వున్నారు.

బిందు, తుంపర సేద్యానికి రిజిస్ట్రేషన్ తప్పనిసరి

రేగిడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బిందు, తుంపర సేద్యం చేస్తున్న రైతులు ఆర్ఎస్‌కేల్లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదు ఎకరాల లోపు ఉన్న ఎస్సీ రైతులకు వంద శాతం రాయితీపై, ఇతర రైతులకు 90శాతం రాయితీ, పది ఎకరాలు దాటిన రైతులకు 70శాతం రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళా సంఘాలను బలోపేతం చేయండి

శృంగవరపుకోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ మహిళా సంఘాలను బలోపేతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ పాణి పేర్కొన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య కార్యవర్గ సమావేశం జరిగింది. మహిళలంతా ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ప్రతి మహిళ ఎంటర్ పెన్యూర్‌గా మారాలన్నారు. స్త్రీనిధి ఉన్నతి సీఐఎఫ్ రికవరీ శతశాతం చేయాలన్నారు. డిజిటల్ ఎంసీపీ ద్వారా బ్యాంకు లోన్లు అవసరమైనవారికి ఇప్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం అరుణ, సీసీలు యు.కోటరావు, మంగమ్మ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చిట్టిబాబు సేవలు అభినందనీయం

విజయనగరం దాసన్నపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణకు దళిత, బహుజన, శ్రామిక యూనియన్ ప్రతినిధి పి.చిట్టిబాబు చేస్తున్న సేవలు అభినందనీయమని ఏటీకే వెలుగు వృద్ధాశ్రమ వ్యవస్థాపకుడు, ఖాదర్‌బాబా దర్గా ధర్మకర్త ఖలీలుబాబు అన్నారు. ఖతర్ రాజదాని దోహాలో ఐక్యరాజ్యసమితి నిర్వహించిన సదస్సులో పాల్గొని పేదరికం, వివక్షత, ఆకలి చావులు అనే అంశంపై మాట్లాడిన చిట్టిబాబు, దంపతులను దర్గా వ్యవస్థాపకులు ఖలీలుబాబు శనివారం సత్కరించారు. కార్యక్రమంలో ఎలిశెట్టి సురేష్, సీఐలు నర్సింహమూర్తి, వెంకట రమణ, ఎస్ఐ సత్యనారాయణ, అహ్మద్‌బాబు, రాము, జైరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌ను కలిసిన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు
- విశాఖ సీఐఐ సదస్సుకు హాజరు



సీఎం చంద్రబాబుతో జనసేన ప్రచారకమిటీ రాష్ట్ర కార్యదర్శి పాగిరి సురేష్‌బాబు



మంత్రి లోకేశ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి



హాజరైన ఎమ్మెల్యే జయకృష్ణ





ముఖ్యమంత్రి చంద్రబాబుకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు, మంత్రి లోకేశ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా

విజయనగరంరూరల్/రాజాం/రూరల్/పాలకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో శనివారం జరిగిన సీఐఐ సదస్సులో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ హాజరయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు, ఐటీ శాఖామంత్రి లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తమ నియోజక వర్గాల్లోని పలు సమస్యలపై చర్చించారు. సాగునీరు, గ్రామీణ రహ దారుల పనులు చేట్టడా నికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేలు కోరారు. వీరితో పాటు జనసేన ప్రచారకమిటీ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ నాయకుడు పొగిరి సురేష్‌బాబు కూడా సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేశ్, నారాయణను కలిసి సమస్యలపై వారికి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు.

పోరాటాలే శరణ్యం

రాజాం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తినాయుడు అన్నారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన యూనియన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మునిసిపల్ కార్మికుల సమస్యల్ని పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. గత సమ్మెకాలంలో అంగీకరించిన ఒప్పందాలు నేటికీ అమలు చేయలేదని గుర్తుచేశారు. ప్రభుత్వం సకాలంలో స్పందించకపోతే దశలవారీ పోరాటానికి సిద్ధం అవుతామని హెచ్చరించారు. సమావేశంలో పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



కాశీవిశ్వేశ్వర ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

వైభవంగా లక్ష దీపారాధన

సంతకవిటి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రెండో ఏకాదశి సందర్భంగా మోదుగులపేటలోని కాశీవిశ్వేశ్వర ఆలయంలో శనివారం లక్ష దీపారాధన అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో శివనామస్మరణ మార్మోగింది. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు.

సీనియర్ సిటిజన్లకు న్యాయ సేవలు

- జిల్లా ప్రధాన న్యాయాధికారి బబిత

విజయనగరం క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో సీనియర్ సిటిజన్లకు న్యాయసేవాధికార సంస్థ ద్వారా న్యాయ సేవలు అందిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎం.బబిత అన్నారు. శనివారం పూల్‌బాగ్‌లోని ప్రేమ సమాజాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. వయోవృద్ధుల పోషణ, నిర్వహణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులను పిల్లలు సరిగ్గా చూడకపోతే, వారిపై కేసు వేసే వెసులుబాటు చట్టంలో ఉందన్నారు. ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే న్యాయ సేవాధికార సంస్థని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి, పీపీ గేదెల సత్యం, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కొండపల్లి సూర్యప్రకాష్, ప్రేమసమాజం కార్యదర్శి ఆదినారాయణ, బసవ మూర్తి, రఘు రామారావు, తాడి రాజు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

- సీనియర్ న్యాయాధికారి శారదాంబ



అధికారులకు సూచనలిస్తున్న సీనియర్ న్యాయాధికారి శారదాంబ

రాజాం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 13న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల న్యాయసేవాసంస్థ అధ్యక్షురాలు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ పిలుపునిచ్చారు. కోర్టుప్రాంగణంలో న్యాయవాదులు, పోలీసు, రెవెన్యూ, బ్యాంకర్లు, చిట్‌ఫండ్ కంపెనీల స్టాండింగ్ కౌన్సిల్స్ మున్సిపాలిటీ, ఎక్సైజ్ అధికారులు, జూనియర్ న్యాయాధికారి కె.నైమిషతో కలిసి శనివారం సమావేశమయ్యారు. అదాలత్‌లో రాజీకి అనుకూలమైన క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్ కేసుల్ని పరిష్కరించుకోవచ్చని సూచించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదాలత్ విజయవంతానికి అన్నిశాఖల అధికారులు సహకరించాలని కోరారు. అదాలత్‌లో ఇచ్చిన తీర్పు అంతిమతీర్పుగా న్యాయాధికారి స్పష్టం చేశారు. సివిల్ కేసులు అదాలత్‌లో పరిష్కారం చేసుకుంటే కోర్టుఫీజు కూడా వాపస్ ఇస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో రాజాం తహసీల్దార్ రాజశేఖర్, రాజాం, సంతకవిటి ఎస్‌ఐలు రవికిరణ్, గోపాలరావు, ఎక్సైజ్ ఎస్‌ఐలు మాన్యాలు, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన చేపట్టాలి

విజయనగరం దాసన్నపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు బీసీ జనాభా దామాషా ప్రకారం చట్టబద్ధ రిజర్వేషన్ అమలయ్యేలా డెడికేటెడ్ సమగ్ర కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గదుల వెంకటరావు డిమాండ్ చేశారు. శనివారం మూడులాంతర్ల సమీపంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమగ్ర కులగణన జరిపించాలని తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేసినట్లు చెప్పారు. దీంతో హైకోర్టు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి పంచాయతీరాజ్, పురపాలక శాఖల ముఖ్య కార్యదర్శులకు, రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు నోటీసులు జారీ చేసిందన్నారు. ఎన్నికల సమయం వచ్చే వరకూ బీసీ కులగణన చేయకపోవడంతో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయం అందించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు గొర్లె సూరిబాబు, హరిబాబు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అదే నిజమైతే జిందాల్‌పై కేసు వెనక్కి తీసుకుంటాం

- ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

ఎస్.కోట రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'అధికారులు ప్రజల కోసం కాకుండా పరిశ్రమల పెద్దల కోసం పనిచేయడం బాధగా ఉంది. జిందాల్ భూములపై వారు వ్యవహరిస్తున్న తీరు సరిగాలేదు' అని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. శనివారం బొడ్డవర గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిందాల్ కోసం కేటాయించిన భూములు గత 18ఏళ్లుగా ఆ పరిశ్రమ అధీనంలో ఉన్నాయని అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని, ఈ విషయంపై బహిరంగ విచారణ చేపట్టాలని అన్నారు. అదే నిజం అయితే తాము జిందాల్ పరిశ్రమ మీద వేసిన కేసులను వెనక్కి తీసుకుంటామని అన్నారు. ఈ భూములు గత జూన్ వరకూ రైతుల వద్దే ఉన్నాయన్న విషయం ఈ ప్రాంత వాసులకు తెలుసన్నారు. నిర్వాసితులు 154రోజులుగా దీక్ష చేస్తున్నా అధికారులకు పట్టకపోవడం దారుణమన్నారు. ప్రజాప్రతినిధులు కూడా రైతుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు.

నిజాలు బయటకు వస్తున్నాయి



నినాదాలు చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోటరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిందాల్ భూముల్లో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న సర్వేతో నిజాలు బయటకు వస్తున్నాయని నిర్వాసితులు అన్నారు. 154వ రోజు శనివారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గత స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నిర్వహించిన గ్రామసభలో 199 మంది రైతులు జిందాల్‌పై ఫిర్యాదులు చేశారన్నారు. దీనిపై విచారణ చేస్తున్నారని, ఈ తరుణంలో తమ భూములు తమ సాగులోనే ఉన్నాయన్న నిజం వెలుగులోకి రావడం సంతోషం కల్గిస్తుందన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి తమ భూములు వెనక్కి ఇవ్వాలని కోరారు.

మహనీయుడు బిర్సా ముండా



బిర్సా ముండా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

విజయనగరం దాసన్నపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కుల కోసం పోరాడిన మహనీయుడు బిర్సా ముండా అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్ వర్మ అన్నారు. బిర్సా ముండా జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసినివాళులు అర్పించారు. గిరిజనుల భూమి, జీవన అధికారాలను రక్షించడానికి చేసిన పోరాటంతో బిర్సా ముండా చరిత్రలో చిరస్థాయిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పతివాడ రాజేష్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు డిజిటల్ విద్య



మాట్లాడుతున్న సూర్యారావు

శృంగవరపుకోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో దివ్యాంగ విద్యార్థులకు డిజిటల్ విద్యాబోధన అందించనున్నట్లు జిల్లా సహిత విద్యసమన్వయ కర్త ఎస్.సూర్యారావు తెలిపారు. శనివారం స్థానిక భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగుల ఉచిత ఉపకరణాల ఎంపిక నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే భవిత కేంద్రాల్లో ట్యాబ్‌ల ద్వారా బోధన జరుగుతుందన్నారు. గత ఏడాది కొన్ని జిల్లాల్లో ప్రయోగాత్మకంగా దివ్యాంగ విద్యార్థులు కంప్యూటర్ సహాయంతో పరీక్షలు రాసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో డిజిటల్ బోధనకు సమగ్రశిక్ష అభియాన్ ప్రణాళికలు తయారు చేస్తుందన్నారు. ఈ విద్యాసంవత్సరానికి పలు రకాల ఉపకార వేతనాలు తల్లిదండ్రుల ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. కొత్తవలస, వేపాడ, ఎల్.కోట, ఎస్.కోట, జామి మండలాల నుంచి 152 మంది దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకార పరికరాల ఎంపికకు హాజరయ్యారు. వీరిలో 131మందిని అర్హులుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈవో నర్సింగరావు, ఉపాధ్యాయులు ఎస్.భానుమతి తదితరులు ఉన్నారు.

మేలు చేసే పనులపై శ్రద్ధవహించాలి

- డీఎల్‌డీవో హేమసుందర్



చేతుల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎల్‌డీవో

చీపురుపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం అప్పగించిన కార్యక్రమాలను మొక్కుబడిగా నిర్వహించవద్దని, వ్యక్తులు, సమాజానికి మేలు చేసే పనులపై అధికారులు శ్రద్ధ వహించాలని డివిజనల్ అభివృద్ధి అధికారి హేమసుందర్ అన్నారు. శనివారం ఆయన మెట్టపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పరిశుభ్రతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. చేతులు శుభ్రం చేసే విధానంపై వారికి అవగాహన కల్పించారు. మధ్యాహ్న భోజనం తయారీని పరిశీలించారు. వీధుల్లో చెత్త వేయవద్దని, ఈ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో అప్పలనాయుడు, సిబ్బంది ఉన్నారు. రామలింగపురం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం గొర్లె పద్మావతి, బీజేపీ అధ్యక్షుడు ఇప్పిలి నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులకు వచ్చి పశ్చిమ బెంగాల్‌వాసి మృతి

పాచిపెంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణం కోసం కూలీగా వచ్చిన పశ్చిమబెంగాల్ కు చెందిన రంజిత్‌రావు (50) ఈనెల 14న మృతిచెందాడు. తీవ్ర చలితో మృతిచెంది ఉంటాడని పోలీసులు నిర్ధారించారు. గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం నిమిత్తం వారం రోజుల కిందట కాంట్రాక్టర్ వద్దకు వచ్చాడని, అప్పటి నుంచి పని సరిగా చేయకుండా మతిస్థిమితం లేకుండా తిరిగేవాడని పోలీసులు తెలిపారు. సరిగ్గా ఆహారం తీసుకోకపోవడం, ఆపై చలి తీవ్రత వల్ల మోదుగ పంచాయతీ కాత్రిగుడ్డి సమీపంలో మృతిచెంది ఉండడంతో సంబంధిత వీఆర్వో పోలీసులకు సమాచారం అందించారు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.వెంకటసురేష్ శనివారం కేసు నమోదు చేశారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించారు.

1400 లీటర్ల సారా ధ్వంసం

వీరఘట్టం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నగొర సమీపంలో శనివారం తనిఖీలు చేసి 1400 లీటర్ల సారా గుర్తించి ధ్వంసం చేశామని ఎస్ఐ జి.కళాధర్ తెలిపారు. సారా ఎవరైనా తయారు చేసినా అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్లాస్టిక్ విక్రయ దుకాణాలపై దాడులు



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ గ్లాసులు

విజయనగరం టౌన్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చిన్నవీధి, గణేష్ ఆలయం వద్ద ప్లాస్టిక్ విక్రయాలు చేపడుతున్న షాపులపై శనివారం ప్రజారోగ్యశాఖ అధికారి కొండపల్లి సాంబమూర్తి దాడులు చేశారు. 413 కిలోల నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని ఎనర్జీప్లాంట్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. నగరంలో ప్లాస్టిక్ అమ్మకాలు చేపట్టినా.. ప్లాస్టిక్ వస్తువులను వినియోగించినా చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ప్రజారోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

మెరకముడిదాం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వెలుగు డీఆర్‌డీఏ అదనపు సంచాలకులు రత్నాకర్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎ.చిరంజీవి అన్నారు. మండల వెలుగు సమాఖ్య కార్యాలయంలో శనివారం 44 గ్రామ సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరంలో సభ్యులకు అవసరం అయినప్పుడు మాత్రమే రుణాలు అందజేస్తామన్నారు. రుణాలను జీవనోపాధి కార్యక్రమాలకు ఉపయోగించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. మండలంలో 1,553 సంఘాల్లో ఉన్న సభ్యులందరికీ మన డబ్బులు- మన లెక్కలు కార్యక్రమంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు తాడెల స్వాతి, ఏపీఎం రాజశేఖర్, సీసీలు కోటేశ్వరరావు, శాంతారావు, సూర్యారావు, సత్యనా రాయణ, వెంకటరమణ, వీవోఏలు పాల్గొన్నారు.

ఈ-పంట సోషల్ ఆడిట్

గరివిడి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కోడూరు గ్రామంలో శనివారం మండల వ్యవసాయాధికారి పి.ప్రసాదరావు ఆధ్వర్యంలో ఈ-పంట సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈ-పంట అర్హుల జాబితాను ప్రదర్శించారు. జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు హాజరై మాట్లాడారు. జాబితాలో రైతుల పేర్లు, సర్వే నెంబర్లు, పంటల సాగు విస్తీర్ణంలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. ఈ-పంట నమోదుతో ధాన్యం కొనుగోలు, విత్తనాలు, ఎరువులు, పంటల బీమా, పంట నష్టపరిహారం, వివిధ వ్యవసాయ సబ్సిడీ పథకాలు వర్తిస్తాయిని తెలిపారు. కార్యక్రమంలో చీపురుపల్లి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎన్.కోటేశ్వరరావు, వీఏఏ పర్వేజ్, కృష్ణారావు, రైతులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

గంట్యాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ పీరుబండి హైమావతి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ముందుగా వ్యవసాయ అధికారి శ్యామ్ కుమార్ తమ శాఖ ప్రగతిని చదివి వినిపించారు. అనంతరం గంట్యాడ ప్రాథమిక వైద్యాధికారి హేమలత మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు, ప్రస్తుతం వాతావరణ పరిస్థితిని వివరించారు. విద్యుత్ శాఖ జేఈ శ్రీనివాస్ మాట్లాడుతూ గత నెలలో మొంథా తుఫాన్ కారణంగా విద్యుత్ స్తంభాలు నేల కూలిపోయాయని, అందరి సహకారంతో స్తంభాల పునరుద్ధరణ చేపట్టినట్లు తెలిపారు. తహసీల్దార్ నీలకంఠేశ్వరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో భూముల రీ సర్వే జరుగుతుందని, దీనిని రైతులు అందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో 2025-2026 సవరణ బడ్జెట్, 2026-2027 అంచనా బడ్జెట్‌ను ఎంపీవో రమణమూర్తి చదివి వినిపించడంతో సభ్యులు ఆమోదించారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన

సంతకవిటి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి నిర్మూలనపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఎంపీడీవో సురేష్‌కుమార్, తహసీల్దార్ సుదర్శనరావు అన్నారు. శనివారం స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయులు, డాక్టర్ నాగేంద్రప్రసాద్, ఆరోగ్య సిబ్బందితో కలసి కుష్ఠు వ్యాధి నిర్మూలనపై పోస్టర్లు చూపిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు.

ఫైలేరియా నిర్ధారణ పరీక్షలు

గుర్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గూడెం, పాలవలస గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఫైలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారిణి వై.మణి ఆధ్వర్యంలో విజయనగరం అర్బన్, రూరల్ ఫైలేరియా యూనిట్ సిబ్బంది రక్తపూతలు సేకరించారు. ఈ రెండు గ్రామాల్లోనూ గతంలో ఫైలేరియా కేసులు రావడం, గత కొన్నేళ్లుగా డీఈసీ సామూహిక మాత్రలు మింగించే కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో వ్యాధి తీవ్రతను అంచనా వేసేందుకు మరోసారి ప్రత్యేకంగా ఈ పరీక్షలు నిర్వహి స్తున్నట్టు డీఎంవో మణి తెలిపారు. రెండు గ్రామాల్లో 20 సంవత్సరాల వయసు దాటిన 600 మందికి ఈ పరీక్షలు నిర్వహించినటు చెప్పారు. గుర్ల, తెట్టంగి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతులను ఆదుకుంటాం

గుర్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పాడి రైతులను ఆదుకోవడంలో విశాఖ డెయిరీ ముందుంటుందని పాలవలస విశాఖ డెయిరీ అధ్యక్షుడు పెనుమజ్జి అప్పలనాయుడు అన్నారు. శనివారం పాలవలస గ్రామంలో పాడి రైతులకు పాల క్యాన్లు అందజేశారు. కార్యక్రమంలో గుర్ల ఏరియా సూపర్‌వైజర్ ఎం.పాపినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS ఆంధ్రజ్యోతి

వధువు కావలెను
మాల క్రిస్టియన్ సెకండ్ మ్యాచ్ వయస్సు 35సంవత్సరాలు ఎత్తు 5/9 గవర్నమెంట్ ఎంప్లాయ్ వరుడికి వధువు కావలెను. సెల్: 7794911019
AJD:244486

ఆంధ్రజ్యోతి
అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరుకైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.
ఫోన్ నెంబర్లు : ACM : 99854 11514
ACO : 99854 11533
Office : 08942 - 281995

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మింపబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు:
9985411522, 9985479944, 9985406982, 9440567403, 9985489266

బిల్లులు చెల్లించేలా చర్యలు

● పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ జిల్లా అధికారి నగేష్‌బాబు

పార్వతీపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పూర్తి స్థాయిలో నిర్మాణాలు పూర్తయిన పనులకు బిల్లులు చెల్లిస్తామని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ జిల్లా అధికారి నగేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఆంధ్రజ్యోతిలో రహదారి నిర్మాణానికి 50 లక్షలు శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో ఆయన స్పందించారు. తమ శాఖ ఉన్నతాధికారులు ఢిల్లీలోని అధికారులతో మాట్లాడి బిల్లులు చెల్లింపులు జరిగేలా చూస్తామని, ఈనెల 30లోగా ఈ పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తమకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఇకపై మంజూరు చేసే పనులకు 50 లక్షలు మించి పరిపాలన ఆదేశాలు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని తమకు ఆదేశించినట్టు ఆ ప్రకటనలో తెలిపారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి: కలెక్టర్

బెలగాం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పార్వతీపురంలో వైద్యారోగ్య శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం నుంచి కుష్ఠువ్యాధిగ్రస్థులను గుర్తించి కార్యక్రమాలు నిర్వహించాలని, కుష్ఠువ్యాధిపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు ఆదేశించారు. 15 నుంచి 26 ఏళ్ల వయస్సులో ఉన్న వారికి అవగాహన కల్పిస్తే రాబోయే తరాల వారు వ్యాధి బారినపడకుండా ఉంటారని వివరించారు.కార్యక్రమంలో డీఎం హెచ్‌వో భాస్కరరావు, డీఈవో రాజ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ విజయగౌరి పాల్గొన్నారు.

'హిమాచల్' సదస్సుకు కలెక్టర్

పార్వతీపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలిలో ఈ నెల 20, 21 తేదీల్లో జరుగనున్న జియోస్పేషియల్ మ్యాపింగ్, డ్రోన్ సర్వేలపై జరిగే ప్యానెల్ చర్చలో పాల్గొనేందుకు మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డికి ఆహ్వానం అందింది. భారతదేశంలో భూ పరిపాలనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం స్వీకరణపై హిమాచల్ ప్రభుత్వం జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనుంది. ఆ సదస్సులో కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొంటారు.

గిరిజనుల విద్యాభివృద్ధే ధ్యేయం: విప్

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల విద్యాభివృద్ధే కూటమి ప్రభుత్వం ధ్యేయమని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు.శనివారం గుమ్మలక్ష్మీపురంలో ఎమ్మార్సీ భవనానికిశంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్, ఎంఈవో శేఖర్,కురుపాం ఏఎంసీ చైర్మన్ కడ్రక కళావతి, టీడీపీ నాయకులు వెంకటరావు, భారతి పాల్గొన్నారు.

●కురుపాం,నవంబరు15(ఆంధ్రజ్యోతి): కురుపాంలో గౌడువీధిలకు ఎదురుగా ఉన్న ప్రభుత్వస్థలంలో శనివారం ఎంఆర్‌సీ భవననిర్మాణానికి ప్రభుత్వ విప్ జగదీశ్వరి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ కోలా రంజిత్‌కుమార్, ఎంఈఓ ఎన్.సత్యనారాయణ పాల్గొనారు.

సువర్ణముఖిలోకి 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మక్కువ రూరల్, నవంబరు 15(ఆంధ్ర జ్యోతి): మండలంలోని శంబర సమీపంలోగల వెంగళరాయసాగర్ ప్రాజెక్టు ద్వారా 500 క్యూసెక్కుల సువర్ణముఖినదిలోకి శనివారం అధికారులు విడిచిపెట్టారు.వర్షాలు తగ్గినా ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో తగ్గకపోవడంతో జలాశయంలో నీటినిల్వ పెరుగుతోందని, దీంతో జలాశయంలోకి వచ్చి చేరుతున్న ఇన్‌ఫ్లోను నదిలోకి విడిచి పెడుతున్నామని ప్రాజెక్టు ఏఈ రాజశేఖర్ విలేకరులకు తెలిపారు.శుక్రవారం 200క్యూ సెక్కుల నీటిని నదిలోకి విడిచిపెట్టగా శనివారం మరో 500 క్యూసెక్కుల నీటిని విడిచి పెట్టామని చెప్పారు.

వ్యాసరచన పోటీలో సత్తాచాటిన బాలిక

పాలకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):పాలకొండ ప్రభుత్వ బాలికల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న లావేటి రుషిత సత్యసాయి సేవా సంస్థలు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో సత్తాచా టింది.ఈ మేరకు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. సత్యసాయి వందో జయంతి వేడుకల్లో భాగంగ పట్టణ, జిల్లా, రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలను సెప్టెంబరులో సత్యసాయి సేవా సంస్థలు నిర్వహించాయి. ఈ మేరకు ప్రతిచూపిన రుషితకు ప్రశాంతి నిలయంలో బంగారు పతకం అందజేయనున్నట్లు సత్యసాయి సంస్థల రాష్ట్ర అధ్యక్షులు ఆర్.లక్ష్మణరావు, సత్యసాయి సంస్థల ప్రతినిధులు కిషోర్, నేతాజీనాయుడు, పి.శ్రీదేవి, మోహన్‌రావు, రమణారావు, సత్యప్రభ తెలిపారు.

పీహెచ్‌పీ వ్యతిరేక కమిటీ ఏర్పాటు

మక్కువ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగ్గేరు ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన పంప్‌డ్ హైడ్రో స్టోరేజ్ పవరు ప్రాజెక్టును(పీహెచ్‌పీ) వ్యతిరేక కమిటీని ఏర్పాటుచేశారు. ఈ మేరకు శనివారం దుగ్గేరులో గిరిజన నాయకులు రాయలసుందర్రావు, రైతు కూలీ సంఘం నాయకులు డి.వర్మ, ఊయక ముత్యాలు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల గిరిజనులతో కూడిన కమిటీని ఏర్పాటుపై చర్చించారు. కన్వీనరుగా రాయలసుందర్రావు, కోకన్వీనర్లగా ఊయక ముత్యాలు, పీడిక అసిరి, మర్రి చెంచుతో 32మంది సభ్యులను నియమించారు. దుగ్గేరులో ఏర్పాటు చేయబోయే పంప్‌డ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్టును అనుమతులను రద్దుచేయాలని, గిరి జన ప్రాంతంలో రైతులకు ఉపయోగకరమైన సురాపాడు మినీ రిజర్వాయరు నిర్మాణం పూర్తిచేయాలని కమిటీ తీర్మానించింది.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కురుపాం, నవంబరు15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కురుపాం ఎక్సైజ్ ఎస్‌ఐ రాజశేఖర్ కోరారు. శనివారంకురుపాం జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కుమారస్వామి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎ.రామమోహనరావు,రమేష్ పాల్గొన్నారు.

నారాయణసేవకు రూ.లక్ష విరాళం

పాలకొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు తెన్నేటి పార్వతమ్మ నారాయణసేవ నిమిత్తం రూ.లక్ష విరాళం ప్రకటించారు. సత్యసాయి జయంతి పురస్కరించుకుని శనివారం విరాళాన్ని సత్యసాయిబాబా మందిర నిర్వాహకులకు అందించారు.

అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ

వీరఘట్టం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):వీరఘట్టంలో అయ్యప్పస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇక్కడ నిర్మించిన శబరిమల హరి హరాత్మజ నిలయం ప్రతిష్ఠా మహోత్సవం చివరిరోజు శనివారం కన్నుల పండుగగా నిర్వహించారు.యజ్ఞకర్త సర్వాజోస్యుల శర్మయాజీఆధ్వర్యంలో జరిగిన పూజల్లో పెద్ద సంఖ్యలో దంపతులు పాల్గొని పూజలుచేశారు. సాయంత్రం కల్యాణోత్సవం నిర్వహించారు.

శ్రీవారి ఆలయంలో దీపారాధన

సీతంపేట రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సీతంపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం పురస్కరించుకుని శనివారం దీపారాధననిర్వహించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దీపారాధన కార్యక్రమంలో రెండు వేల దీపాలను మహిళలు వెలిగించారు. వివిధ ఆకృతుల్లో దీపాలను అమర్చి వెలిగించడంతో దీపాల వెలుగుల్లో శ్రీవారి ఆలయం ప్రకాశవంతంగా వెలుగొందింది.



వీరఘట్టం: పూజలు చేస్తున్న దంపతులు

అంతిమ సంస్కారాలకు అగచాట్లు

●రహదారి లేక మృతదేహాల తరలింపునకు పాట్లు ● ఇదీ పార్వతీపురంలోని పలువార్డుల్లో పరిస్థితి

పార్వతీపురంటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని 24, 25, 26, 29వ వార్డులకు చెందిన ప్రజలు అంతిమ సంస్కారాలకు అగచాట్లకు గురవుతున్నారు. ఇక్కడి శ్మశాన వాటికకు వెళ్లేందుకు రహదారి లేకపోవడంతో మృతదేహాల తరలింపునకు బంధువులు అవస్థలుపడుతున్నారు. నాలుగు వార్డులకు సంబంధించిన వారు మృతిచెందితే దహన సంస్కారాలు నిర్వహణకు కొన్నేళ్ల కిందట శ్మశానవాటికకు ప్రభుత్వం స్థలం కేటాయించింది.అయితే పక్కా రహదారి సదుపాయం కల్పించకపోవంతో వర్షాకాలంలో బురద, మురుగు నీటి మధ్యమృతదేహాలను తరలించాల్సివస్తోందని బంధువులు వాపోతున్నారు. శనివారం కుసుమగుడ్డి వీధిలో ఓ వ్యక్తి మృతి చెందడంతో దహన సంస్కారాలు నిర్వహించే కుటుంబ సభ్యులు, ఆ వీధివాసులు ఇక్కట్లకు గురయ్యారు.ఇప్పటికైనా ఆక్రమణల నుంచి శ్మశాన వాటికను విముక్తి చేసి తమకు అప్పగించాలని ఆయా వార్డులకు చెందిన వీధుల నివాసితులు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను కోరుతున్నారు.



మురుగునీటిలో శ్మశానవాటికకు మృతదేహాన్ని తీసుకువెళ్తున్న దృశ్యం

బిర్సాముండాను ఆదర్శంగా తీసుకోవాలి

●జిల్లాలో జన జాతీయ గౌరవ దివస్

బిర్సాముండాను ఆదర్శంగా తీసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు సూచించారు. శనివారం భారతీయ ఆదిమ జాతుల స్వాతంత్ర్య పోరాట యోధుడు, గిరిజన జానపద నాయకుడు బిర్సా ముండా జయంతి పురస్కరించుకుని జన జాతీయ గౌరవ దివస్ నిర్వహించారు.ఈ సందర్భంగా బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనచేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.

●పార్వతీపురం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం కోసం బిర్సా ముండా సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక గిరిజనాభివృద్ధి సంస్థ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన బిర్సాముండా 150వ జయంతిముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం గిరిజన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందించారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సలహా మండలి సభ్యురాలు తేజోవతి, సభ్యుడు కృష్ణబాబు, ఐటీడీఏ అదనపు ప్రాజెక్టు అధికారి మురళీధర్, ట్రైకార్ సభ్యురాలు లావణ్య పాల్గొన్నారు.

●జియ్యమ్మవలస, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏజెన్సీలో బిర్సా ముండా చిత్రపటానికి గిరిజనాభ్యుదయ సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి మధు, ఉపాధ్యక్షులు ఎస్.మాణికేశ్వరరావు, వి.సింహాచలం, గిరిజన హక్కుల ఫోరం అధ్యక్షులు ఐ.రామకృష్ణ, ఎస్.శ్రీనివాసరావు, రాంబాబు పాల్గొన్నారు.

●భామిని, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏకలవ్య మోడల్ స్కూల్‌లో బిర్సా ముండా జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాదేవి పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. భామిని ఎంఈవో పాల్గొన్నారు.



భామిని: బిర్సాముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

● సీతంపేట రూరల్,నవంబర్ 15(ఆంధ్రజ్యోతి):గిరిజన జాతి పోరాటయోధుడు బిర్సా ముండా అని శ్రీకాకుళం జిల్లా అసిస్టెంట్ (ట్రైనీ)కలెక్టర్ పృధ్వీరాజ్ తెలిపారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో బిర్సా ముండా జయంతి నిర్వహించారు. తొలుత జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఐటీఐ కళాశాల నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీని నిర్వహించారు. .బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగాన్ని లైవ్‌షో ద్వారా ప్రదర్శించారు.కార్యక్రమంలో పాలకొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పి.భూదేవి, ఏపీవో ఆర్‌వీ గణేష్, డిప్యూటీ ఈవో రామ్మోహనరావు, పాల్గొన్నారు.

● బెలగాం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బీజేపీ కార్యాలయంలో బిర్సా ముండా జయంతి సందర్భంగా చిత్రపటానికి పార్టీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



బెలగాం: స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



గుమ్మలక్ష్మీపురం: మొక్క నాటుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● జిల్లావ్యాప్తంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు కోరారు. శనివారం జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో శు భ్రంచేయడంతోపాటు మొక్కలు నాటారు.

● గుమ్మలక్ష్మీపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. స్థానిక ఎంపీడీవోకార్యాలయ ప్రాంగణంలో ఎంపీడీవో ఐవీ లక్ష్మి ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్, ఎంఈవో చంద్రశేఖర్, ఏఎంసీ చైర్‌పర్సన్ కళావతి, టీడీపీమండలాధ్యక్షుడు అడ్డాకుల నరేష్, భారతిభూషణరావు పాల్గొన్నారు.

● బెలగాం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దైనందిక జీవితంలో పరిశుభ్రత ప్రధానమని, పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. పార్వతీపురం కలెక్టరేట్‌లో వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ధర్మ చంద్రారెడ్డి, డీఆర్వో హేమలత, డీఎంహెచ్‌వో భాస్కరరావు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన

జిల్లాలోని శాఖాగ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన ఏర్పాట్లుచేశారు. శనివారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వాహకులు పలు కార్యక్రమాలు నిర్వహించారు.

సీతంపేట రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):స్థానిక గ్రంథాలయంలో 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి బి.గణేష్ మాట్లాడుతు ఈనెల 19 వరకు గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రదర్శనలో గ్రంథాలయ సహాయకుడు రామకృష్ణవిద్యార్థులు పాల్గొన్నారు.

● గరుగుబిల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. గరుగుబిల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రజనీ కుమారి, గ్రంథాలయ అధికారి కె.మాధవి సహకారంతో అవసరమైన పుస్తకాలను సమకూర్చారు. కార్యక్రమంలో నిర్వాహకులు నల్ల మధుసూదనరావు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: శాఖా గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న పాఠకులు

రేపటి నుంచే..

(5వ పేజీ తరువాయి)

సన్నద్ధమవుతున్నారు.' జిల్లాలో సోమవారం నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తాం. కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. దీనికి సంబంధించి సిబ్బందిని నిమించాం. మిల్లర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశాం. సుమారు 196 మిల్లుల నుంచి రూ. 150 కోట్ల మేర బ్యాంకు గ్యారెంటీలు రావాల్సి ఉంది. ప్రస్తుతం కొంతమేర మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీ అందించారు. సోమవారానికి ఇది పూర్తయ్యే అవకాశం ఉంది. గతంలో నెలకొన్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని రైతుసేవా కేంద్రాల పరిధిలో అన్నదాతలకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నాం. ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తాం. దళారులు రైతులకు వద్దకు చేరకుండా చర్యలు చేపట్టాం. దీనిపై మండల స్థాయి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశాం.' అని జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ కె.శ్రీనివాస్ తెలిపారు.

ఒడిశా టు కేరళ

(5వ పేజీ తరువాయి)

కిందట ఒడిశాలోని నవరంగ్ పూర్‌కు చెందిన వ్యక్తితో ఫోన్‌లో సంప్రదించారు. అనంతరం బలాం గిరిలో గంజాయిని కొనుగోలు చేశారు. అక్కడి నుంచి కారులో వారు బత్తిలి మీదుగా కేరళకు వెళ్తుండగా.. స్థానిక పోలీసులు వెంబడించి వారిని పట్టుకున్నారు.' అనిడీఎస్పీ తెలిపారు. కారులో 53 ప్యాకెట్లలో క్వింటా ఐదుకిలోల గంజాయి ఉందన్నారు. వాటిని రూ.రెండు లక్షలకు కొనుగోలు చేసినట్టు నిందితులు వెల్లడించారన్నారు. అయితే గంజాయిని ఎక్కడ నుంచి ఎక్కడికి తరలి స్తున్నారనే దానిపై ముమ్మ రంగా దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర చగా... రిమాండ్ విధించినట్లు వెల్లడించారు. అనంతరం బత్తిలి చెక్‌పోస్టు సిబ్బంది, పోలీ సులను అభినందించారు. సీఐ ప్రసాద్, ఎస్ఐ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ ఏర్పాటుకు చర్యలు

(5వ పేజీ తరువాయి)

ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా పథకం వర్తిస్తుంది. జిల్లాలో 35,033 మంది ఎస్సీ ఎస్టీలు ఉన్నారు. వీరిలో ఎస్సీలు 14,169 మంది , ఎస్టీలు 20,864 మందిని అర్హులుగా గుర్తించాం. ఇప్పటివరకు 8,312 మంది డాక్యుమెంట్లు అంద జేశారు. వీటిని మళ్లీ పరిశీలిస్తాం. బ్యాంకు అకౌంటు, ఆధార్‌కార్డు దరఖాస్తుతో జత చేయాలి. పాచిపెంట మండలంలో 5,720 మందిని లబ్ధిదారులను గుర్తించాం. జిల్లాలో ఆరు ఏఈ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది.' అని తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ డీఈఈ కె.ప్రసన్నకుమార్ తదితరులు ఉన్నారు.

బంగారం కోసమే హత్య?

●ఉలిక్కిపడ్డ వియ్యంపేట గ్రామస్థులు

కొత్తవలస, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వియ్యంపేటలో ఓ మహిళ శుక్రవారం రాత్రి హత్యకు గురైంది. ఈ విషయం శనివారం ఉదయం తెలిసి గ్రామమంతా ఉలిక్కి పడింది. పుస్తెల తాడు, వెండిపట్టీలు, చెవులకు ఉన్న బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో బంగారం కోసమే గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వియ్యంపేటకు చెందిన దూది రాము(59) భర్త ఇప్పటికే చనిపోవడంతో ఒంటరిగా నివాసం ఉంటోంది. ఈమెకు కుమారుడు గౌరీ శంకర్, కుమార్తెలు సత్యవతి, దేవి ఉన్నారు. కుమార్తెలకు వివాహం కాగా వేర్వేరు చోట్ల స్థిరపడ్డారు. కుమారుడు శృంగవరపుకోట మండలం ముషిడిపల్లి గ్రామం వద్దనున్న లే అవుట్‌లో పని చేసుకుంటూ అక్కడే నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి తల్లి రాము కుమారుడుకు ఫోన్ చేసి ఇంట్లో బియ్యం అయిపోయాయి తీసుకు రావాలని చెప్పింది. శనివారం బియ్యం పట్టుకువస్తానని చెప్పాడు. కాగా ప్రతిరోజు కార్తీక స్నానాల కోసం ఆమె ఉదయం లేచి అందరినీ పిలిచేది. శనివారం ఉదయం ఎంతకూ లేవకపోవడంతో చుట్టుపక్కలనున్న మహిళలు ఇంటికి వెళ్లి చూడగా ఆమె అచేతన స్థితిలో కంటపడింది. వెంటనే కుమారుడు గౌరీశంకర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో ఆయన హుటాహుటిన వచ్చి చూశాడు. తల్లి మెడలో ఉన్న సుమారు మూడున్నర తులాల పుస్తెల తాడు, వెండిపట్టీలు, చెవులకు ఉన్న బంగారు ఆభరణాలు కనిపించడక పోవడంతో బంగారం కోసమే తన తల్లిని ఎవరో హత్య చేసి ఉంటారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిద్రిస్తున్న రాము ముఖంపై తల గడ పెట్టి ఊపిరి ఆడకుండా చేసి చంపి ఉంటారని తల వెనుక గాయాలను బట్టి పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. అర్ధరాత్రి సమయంలో పెద్ద కేక వినిపించినట్టు చుట్టు పక్కల వారు చెబుతున్నారు. ఇంట్లో ఏమైనా గొడవ పడుతున్నారేమోనని పట్టించుకోలేదని పలువురు తెలిపారు. ఈ హత్య స్థానికులే ఎవరో చేసి ఉండొచ్చునన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. విజయనగరం నుంచి వచ్చిన క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించింది. డాగ్ స్క్వాడ్ కూడా వచ్చి వివిధ ప్రాంతాలను పరిశీలించింది. కుమారుడు గౌరీశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ షణ్ముఖరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామ పెద్దల సమక్షంలో శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శృంగవరపుకోట తరలించారు.

అనాథ మృతదేహానికి అంతిమ సంస్కారాలు

బొబ్బిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అనాథ మృతదేహానికి అంతిమ సంస్కారాలు పూర్తి చేసి... మానవత్వాన్ని చాటుకున్నారు బొబ్బిలి పోలీసులు. వివరాలివీ.. మతిస్థిమితం లేని ఓ వ్యక్తి ఈనెల 14న స్థానిక ప్రభుత్వ ఐటీఐ సమీపంలో హెచ్‌టీ విద్యుత్ టవర్ పైకి ఎక్కి... షాక్‌తో అక్కడి నుంచి పడిపోవడంతో గాయాలపాలయ్యాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడు. ఆ మృతదేహం కోసం ఎవరైనా వస్తారేమోనని సీహెచ్‌సీ మార్చురీలో రెండు రోజులు ఉంచారు. ఎవరూ రాకపోవడంతో పోలీసులు , సామాజిక కార్యకర్త క్లైవ్ కూపర్ సహకారంతో ఎస్ఐ రమేష్ సొంత ఖర్చులతో అనాథ మృతదేహానికి అంత్యక్రియలు చేయించారు. మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని క్లైవ్ ప్రార్థనలు చేశారు.



మృతదేహానికి అంత్యక్రియలు చేయిస్తున్న పోలీసులు

రేపు శివపార్వతుల కల్యాణం

సాలూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పాచిపెంట మండలంలోని పణుకువలస సమీపంలోగల పారమ్మకొండ అమ్మవారి చెంత సోమవారం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాలూరు, పాచిపెంట మండలాలతోపాటు అనేక గ్రామాల ప్రజలు హాజరుకావాలని కోరారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

సాలూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు మునిసిపల్ అధికారులు శనివారం తొలగింపు చర్యలు చేపట్టారు.ఇందులో భాగంగా 29వ వార్డులో రాణి వారి కోనేరు గట్టులో అక్రమంగా నిర్మించిన పలు కట్టడాలను మునిసిపల్ సిబ్బంది తొలగించారు. ఇంకా పలు చోట్ల పూర్తిస్థాయిలో తొలగింపు చర్యలు చేపడతామని మునిసిపల్ ప్లానింగ్ అధికారిని ఝాన్సీ తెలిపారు.

పిలిచి అవమానించారు

పార్వతీపురం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో బిర్సా ముండా జయంతి పురస్కరించుకుని జన జాతి గౌరవ దివస్‌లో భాగంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి గిరిజన సంఘాల నాయకులను పిలిచి అవమానించారని ఆ సంఘ నాయకులు గౌరమ్మ తదితరులు శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గిరిజన సంఘాలకు ప్రత్యకంగా ఆహ్వానించి తమకు కుర్చీ లేకుండా చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.

వేతనాలు చెల్లించాలి

పాలకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికులకు రెండు నెలలుగా వేతన బకాయిలు చెల్లించాల్సిఉందని, నవంబరు నెల వేతనాలు కూడా చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, కార్యవర్గ సభ్యులు ఎం.వీరనాయుడు కోరారు. శనివారం పాలకొండ నగర పంచాయతీ కమిషనర్ రత్నంరాజుతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతినెలా వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతినెలా వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకుంటానని వారికి కమిషనర్ హామీఇచ్చారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి

కొమరాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):విశాఖలో డిసెంబరు 31 నుంచి జరిగే సీఐటీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం మండల పార్టీ కార్యదర్శి కొల్లి సాంబమూర్తి కోరారు. ఈ మేరకు కొమరాడలో మహాసభల గోడపత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఇందిర, ఆశావర్కర్లు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

పార్వతీపురం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల ప్రత్యేకాధికారి సుధారాణి కోరారు. పెదమరికి పంచాయతీలో శనివారం ఆమె పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో సత్యం, డిప్యూటీ ఎంపీడీవో పాపారావు, టీడీపీ నాయకులు గుంపుస్వామి పాల్గొన్నారు.



